ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 144 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## కూతురి వ్యాఖ్యల దుమారం
# అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి కొండా సురేఖ

రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత

సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ

ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



## కేసీ వేణుగోపాల్‌తో
# సీఎం రేవంత్ భేటీ

మంత్రివర్గ విస్తరణపై చర్చ?

ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ

రాష్ట్ర రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చలు

మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై ప్రధానంగా మంతనాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పాలనకు సంబంధించిన కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని సంతరించుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ భేటీలో ప్రధానంగా మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణతో పాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆమోదం కోసం ఆయన వేణుగోపాల్‌తో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పార్టీలో క్రమశిక్షణకు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ సంఘం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, వారు సమర్పించిన వివరణలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తోంది. వీరిపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి అధిష్ఠానం అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి కోరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# ఒకే ఇంట్లో 24 మృతదేహాలు

నేపాల్ వరదలు..

1,003కు పెరిగిన మృతుల సంఖ్య

ఇంకా 4వేల మంది గల్లంతు!

నేపాల్ ఆకస్మిక వరదలు

12వేల మందిని రక్షించిన సహాయక బృందాలు


ఇంకా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

నేపాల్ ఆకస్మిక వరదల్లో మరణించిన వారి సంఖ్య మంగళవారం నాటికి 1000 దాటగా, మరో 4000 మంది గల్లంతయ్యారు. ఇప్పటికీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు తెలిపారు. "నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మరణించినవారి సంఖ్య మంగళవారం నాటికి 1,003కు చేరింది. కాగా, దేశంలోని ఎనిమిది జిల్లాల్లో భద్రతా దళాలు మరిన్ని మృతదేహాలను వెలికితీశాయి. సుమారు 4000 మంది గల్లంతు అయ్యారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 12వేల మందిని రక్షించాం" అని నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) మంగళవారం తెలిపింది.

నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలో మంచు, రాళ్లు విరిగిపడడం లేదా హిమపాతం వల్ల ఆకస్మిక వరదలు సంభవించినట్లు భావిస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన ఈ ఆకస్మిక వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని గ్రామాలను, పట్టణాలను అతలాకుతలం చేశాయి. హిమాలయ సరిహద్దు ప్రాంతం నుంచి దక్షిణ దిశగా ప్రవహించే భోటెకోశి నది వరద నీటిని దిగువకు తీసుకెళ్లింది. దీని ఈ భారీ వరద ధాటికి ఆ మార్గంలోని ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలు అన్నీ కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. ఎన్‌డీఆర్ఆర్ఎంఏ తెలిపిన వివరాల ప్రకారం, నేపాల్‌లోని చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 321 మృతదేహాలు లభించాయి. ఆ తర్వాత నవల్‌పరాసి ఈస్ట్ జిల్లాలో 216, నవల్ పరాసి వెస్ట్- 170, నువాకోట్ -95, గోర్ఖా -65, ధాడింగ్- 57, ..మిగతా 2లో



## స్వదేశీ నినాదంతో
# ముందుకు సాగండి

దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధి 2

బంగారాన్ని అనవసరంగా కొనకండి

డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి

దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం

ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు



## రాంచందర్ రావు అరెస్ట్‌పై
# బండి సంజయ్ మండిపాటు

దాడులు చేసేవారిని కాపాడటమేనా ఇందిరమ్మ రాజ్యం? 2

పరామర్శకు వెళుతున్న నేతలను అరెస్ట్ చేయడం దివాళాకోరుతనమని వ్యాఖ్య

అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

## హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు
# భారీ ఊరట

శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్

సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్

విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

2



## కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి
# కౌంటర్

కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి 2

కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి

కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా

## రాష్ట్ర ప్రభుత్వానికి
# హైకోర్టులో భారీ ఊరట

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై

స్టే ఎత్తివేసిన హైకోర్టు

తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు

సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ..మిగతా 2లో

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# కవితకు వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్

**కవిత చర్యల వల్ల కేసీఆర్ మనోవేదనకు గురవుతున్నారన్న ప్రశాంత్ రెడ్డి**

**కేసీఆర్, కవితలను కలపడానికే తాను ప్రయత్నించానని వెల్లడి**

**కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**



కష్టకాలంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెంట ఉన్నది ఎవరో కవిత తెలుసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. తనపై కవిత చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కవిత చర్యల వల్ల తండ్రి కేసీఆర్ ఎంతటి మనోవేదనకు గురవుతున్నారో ఆమె ఆలోచించుకోవాలని... తాను ఎప్పుడూ కేసీఆర్-కవితలను కలపడానికే ప్రయత్నించాను తప్ప విడగొట్టడానికి కాదని స్పష్టం చేశారు. తాను, తన తండ్రి వేముల సురేందర్ రెడ్డి 2001లో పార్టీ ఆవిర్భావానికి ముందే కేసీఆర్ వెంటే ఉన్నామని, తాము టీఆర్ఎస్ (బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యులమని గుర్తుచేశారు. "బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్" అని పేర్కొన్న ఆయన... కవిత మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పార్టీ లైన్ దాటినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. అసెంబ్లీ లోపలా బయటా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిరంతరం పోరాడుతున్నది ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. తాను కాంగ్రెస్ నాయకులతో ఎలాంటి మంతనాలు జరపలేదని యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ప్రమాణపూర్వకంగా చెప్పగలనని... మరి కాంగ్రెస్‌తో కవిత రహస్య మంతనాలు జరపలేదని ఆమె చెప్పగలరా? అని నిలదీశారు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తులుగా, బలంగా ఉన్న నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తూ... పార్టీని బలహీనపరిచి పరోక్షంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కవిత లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. సభలో ఆమె కన్నీళ్లు పెట్టుకోవడం కేవలం రాజకీయం కోసం, సానుభూతిని పొందేందుకేనని విమర్శించారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీని చేయడంలో తన పాత్ర ఏంటో కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసని, నిన్నటి వరకు ఆమెపై ఉన్న గౌరవాన్ని తన వ్యాఖ్యలతో కవిత స్వయంగా పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


# రాంచందర్ రావు అరెస్ట్‌పై బండి సంజయ్ మండిపాటు

**దాడులు చేసేవారిని కాపాడటమేనా ఇందిరమ్మ రాజ్యం?**

**పరామర్శకు వెళుతున్న నేతలను అరెస్ట్ చేయడం దివాళాకోరుతనమని వ్యాఖ్య**

**అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**



బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధితులను పరామర్శించేందుకు, నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకుని అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. నల్లొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేసిన నిందితులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ నేతలను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయడంలేదని నిలదీశారు. దాడులు చేసేవారిని కాపాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే వారిపై అణచివేతకు దిగడమేనా కాంగ్రెస్ చెబుతున్న 'ఇందిరమ్మ రాజ్యం' అని ధ్వజమెత్తారు. పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో విధ్వంసకర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో పాటు ఇతర నాయకులను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్ముందు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, జరిగే ప్రతీ సంఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు పోలీసులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి కూడా పడుతుందని జోస్యం చెప్పారు.



# ఒకే ఇంట్లో 24 మృతదేహాలు

**మొదటి పేజీ తరువాయి...**

రసువా- 41 , తనాహున్ జిల్లా 38 చొప్పున మృతదేహాలు దొరికాయి.

**ఒకే ఇంట్లో 24 మృతదేహాలు**

వరద ప్రభావిత నువాకోట్ జిల్లాలోని బెత్రావతిలో ఒక ఇంట్లో ఇప్పటి వరకు 24 మృతదేహాలను సహాయక సిబ్బంది సోమవారం వెలికితీశారు. ఈ విషయాన్ని ఆ జిల్లా ఎస్పీ బిపిన్ రెగ్మీ వెల్లడించారు. ఆ ఇంట్లో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, అది పూర్తయ్యాక మృతుల వివరాలు తెలుస్తాయని అన్నారు.

**డీఎన్‌ఏ టెస్టింగ్ కోసం బారులు తీరుతున్న జనం**


వరదల్లో చిక్కుకుని మరణించిన వారి మృతదేహాలను లేదా శరీర భాగాలను గుర్తించేందుకు, డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ చేయించుకోవాలని నేపాల్ పోలీసులు సోమవారం ప్రజలను కోరారు. విదేశాల్లో నివసిస్తున్నవారు ప్రామాణిక ల్యాబ్‌ల్లో డీఎన్‌ఏ ప్రొఫైలింగ్ చేయించుకొని, దాని సాఫ్ట్ కాపీని మెయిల్ ద్వారా పంపాలని స్పష్టం చేశారు. దీనితో డీఎన్‌ఏ సేకరణ కేంద్రాలకు మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొంటున్నారు.

**త్రిశూలి 3ఏ ప్లాంట్- రెస్క్యూ ఆపరేషన్**

త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్లాంట్ క్రౌన్ హెడ్‌ను సహాయక బృందాలు గుర్తించాయని ఆ దేశ హోంమంత్రిత్వశాఖ మంగళవారం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వద్ద నేపాల్ సైన్యం, సాయుధ పోలీసుల దళం, విద్యుత్ సిబ్బందితో కూడిన 90 మంది సభ్యుల బృందం గాలింపు చర్యలు చేపడుతోందని ప్రకటించింది. "జలవిద్యుత్ ప్లాంట్ క్రౌన్ హెడ్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. డ్రిల్లింగ్ చేసి 10 మీటర్ల లోతు బురద పొరను తొలగించి, ఒక ఇన్‌లెట్ ఏర్పాటు చేశారు. మరో ఇన్‌లెట్ ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి. గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి" అని నేపాల్ హోంమంత్రిత్వశాఖ పేర్కొంది.

**మళ్లీ వరద హెచ్చరికలు**

మరోవైపు నేపాల్‌లోని అనేక జిల్లాల్లో నీటి మట్టాలు పెరుగుతున్నాయి. దీనితో నేపాల్ తాజాగా మరోసారి వరద హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికే త్రిశూలిని, రసువాను కలిపే రహదారి కొట్టుకుపోయింది. త్రిశూలి వైపు నీరు చాలా వేగంగా ప్రవహిస్తుండడంతో, రోడ్లు, మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనితో ఆ మార్గం అత్యంత ప్రమాదకరంగా మారిందని అధికారులు చెబుతున్నారు.






# రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

**మొదటి పేజీ తరువాయి...**

డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# ఇండిగో విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 (ప్రభాత ఉదయం) :**

గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు




నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు భారీ ఊరట

**శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్**

**సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్**

**విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# గద్వాల ఎల్.ఐ.సి బ్రాంచ్ ఆవరణలో ఘనంగా 70వ సంస్థాపక దినోత్సవ వేడుకలు

### దేశ ఆర్థిక రంగానికి ఎల్.ఐ.సి వెన్నుముక్క: బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు







**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 ( ప్రభాత ఉదయం)**

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్.ఐ.సి) 70వ సంస్థాపక దినోత్సవ వేడుకలు మంగళవారం గద్వాల ఎల్.ఐ.సి బ్రాంచ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బ్రాంచ్ ఎస్.బి.ఎం కులశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ... దేశంలో అగ్రగామి ప్రభుత్వ రంగా సంస్థగా సేవలందిస్తున్న ఎల్.ఐ.సి, జాతీయ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే గర్వకారణంగా నిలిచిందని కొనియాడారు.

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎల్.ఐ.సి ప్రస్థానం:**

1956 సెప్టెంబర్ 1కి పూర్వం దేశంలో 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రజల నుంచి ప్రీమియంలు వసూలు చేస్తూ, స్వలాభాల కోసం వాడుకుంటూ పాలసీదారులను మోసగిస్తున్న తరుణంలో... కేంద్ర ప్రభుత్వం వాటన్నింటినీ విలీనం చేస్తూ ఎల్.ఐ.సిని జాతీయం చేసిందని తెలిపారు. 1956లో కేవలం రూ. 5 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ 2011 నాటికి ఐఆర్డీఏ (×=ణూ×) నిబంధనల ప్రకారం తన మూలధనాన్ని రూ. 100 కోట్లకు పెంచుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఆఫీస్ ప్రెసిడెంట్లు, కార్యదర్శులు ఆనంద్, మురళి, బసవేశ్వర్, మల్లికార్జున్ గౌడ్, రజాక్ ,పద్మావతి, రాఘవేంద్ర, అనిల్ కుమార్, ఉదయ్ కుమార్, మల్లికార్జున్, శివ, సూరజ్, మనీష్, శైలేష్, లక్ష్మీకాంత్, కృష్ణ చైతన్య, ప్రవీణ్ పాల్గొన్నారు.



## మొక్కుబడిగా కూల్చివేతలు

**గద్వాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 ( ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణ పరిధిలోని భీంనగర్ లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన కోట్ల విలువైన 10% స్థలం ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణల నేపథ్యంలో, మున్సిపల్ అధికారులు చేపట్టిన కూల్చివేతల హడావుడి కేవలం మొక్కుబడి చర్యగానే ముగిసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జేసీబీ మరియు పోలీసుల సహాయంతో నాలుగు గంటల పాటు హడావుడి చేసిన అధికారులు, చివరకు కబ్జాదారుల సూచనల మేరకు కొద్దిపాటి రాళ్లను మాత్రమే తొలగించి వెనుతిరగడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. రికార్డుల్లో వ్యవసాయ భూమిగా నమోదై ఉండి, నాలా కన్వర్షన్ లేకపోవడంతో ఖాళీ స్థలంలో భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు ఎలా వచ్చాయన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జారీ చేసిన అనుమతుల మంజూరులో భారీగా ముడుపులు చేతులు మారాయని ప్రచారంజరుగుతుండటంతో, కేవలం నామమాత్రపు చర్యలతో సరిపెట్టకుండా స్థలానికి సంబంధించిన పూర్తి రికార్డులు , బిల్డింగ్ పర్మిషన్లపై సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను నిబంధనల ప్రకారం తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




ఐటి కారిడార్ లో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పరిశీలన చేస్తున్న జాయింట్ సీపీ తోపాటు ఇతర అధికారులు..

## ఐటీ ఉద్యోగులకు ట్రాఫిక్ కష్టాలు తొలిగేలా ప్రణాళికలు

### సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సుప్రీత్ సింగ్

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 1,(ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుప్రీత్ సింగ్, నేతృత్వంలో అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. వాహనదారుల ప్రయాణం వేగవంతంగా, సురక్షితంగా సాగేలా ప్రస్తుత యు-టర్న్, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాట్లను సమీక్షించారు. జెఎన్‌టియు నుండి రాయదుర్గం మెట్రో వరకు ప్రత్యేక క్యారేజ్‌వే జెఎన్‌టియు నుండి సింక్రనీ (రాయదుర్గం) మెట్రో స్టేషన్ వరకు కేపీహెచ్‌బీ, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారిని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారంలో సోమవారం నుండి శుక్రవారం వరకు పీక్ అవర్స్‌లో తీవ్ర ట్రాఫిక్ ఉండే ఈ కారిడార్‌లో ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేక క్యారేజ్‌వే ఏర్పాటు చేసే అవకాశంపై అధ్యయనం చేశారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే ఐటీ ఉద్యోగుల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు కారిడార్‌లోని ఇతర వాహనదారులకు కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయని సీపీ నాయకత్వంలో అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. యు టర్న్ ల వద్ద రద్దీకి చెక్ పీక్ అవర్స్‌లో వాహనాల రద్దీ, రోడ్డు వెడల్పు, వాహనాలు తిరిగే రేడియస్ వల్ల ఏర్పడుతున్న సమస్యలను పరిశీలించారు. ప్రధాన జంక్షన్ల వద్ద మిక్సింగ్ ట్రాఫిక్ పాయింట్లను తగ్గించి, ఆర్టీసీ బస్సులు, ప్రజారవాణా వాహనాలకు ప్రాధాన్యతనిచ్చేలా మార్పులు చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డిసిపి సంక్రాంతి రవికుమార్, అదనపు డిసిపి జి. హనుమంతరావు, మాదాపూర్ డివిజన్ ఏసీపీ కె. చంద్రశేఖర్ రెడ్డి ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

## ఘాశకుర్తి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 1 (ప్రభాత ఉదయం)**

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంభం ప్రసాద్ అధ్యక్షతన ఘాశకుర్తి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరం ద్వారా గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు మరియు ఆరోగ్య సంబంధిత సేవలు అందించబడ్డాయి.శిబిరంలో నిర్వహించిన కంటి పరీక్షల సేవలతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు లబ్ధి పొందారు.ఈ సందర్భంగా, గ్రామ సర్పంచ్ శ్రీ చిందం ఆంజనేయులును లయన్స్ క్లబ్ ఘనంగా సత్కరించింది. అలాగే, శిబిర నిర్వహణలో తమ విలువైన సహకారం మరియు మద్దతు అందించినందుకు గాను వార్డు సభ్యులు శ్రీ వి. రాజశేఖర్ కు బిపి (ద్రూ) పరీక్షలు నిర్వహించిన అనతరం సత్కరించారు. కరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్, మెతుకు కె. చైతన్య, ఐత సూరజ్, కోల అన్నారెడ్డి మరియు స్థానిక గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావడంలో తమ వంతు కృషి చేశారు.



## కూలీలుగా మారిన నర్సంగ్ కళాశాల సిబ్బంది

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 ( ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో పని చేస్తున్న అటెండర్లు, ఇతర సిబ్బందిల చేత ఫర్నిచర్ మోయించడం కూలీ పనులు చేయించడం వివాదస్పదంగా మారింది. డీసిఎం వాహనాల్లో నర్సింగ్ కళాశాలకు వచ్చిన పర్నీచర్ , బీరువాలు కళాశాలలోకి షిఫ్టింగ్ చేసేందుకు అటెండర్లను కూలీలుగా మార్చి పనులు చేయించడం పట్ల విమర్శలు వెలువెత్తాయి. ఫర్నిచర్ రవాణా, అన్‌లోడింగ్ మరియు నిర్వహణకు బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, కూలీల ఖర్చులు ఆదా చేసే సాకుతో ప్రిన్సిపాల్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి ఈ పనులు చేయించడం అధికారుల నిర్లక్ష్యానికి, నిర్వహణ లోపానికి అద్దం పడుతోంది. కళాశాలలో జరిగిన సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.






## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించవల్సిందే

### జేపీసీ ఛైర్మన్ యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ, రంగారెడ్డి జిల్లా తరఫున, మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఐ డి ఓ సి, కొంగరకలాన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించడము జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో ఐ డి ఓ సి కొంగరకలాన్ లో సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్దరించాలని ఉద్యోగ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా టి జి ఈ జేఏసీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ... సి పి ఎస్ అనేది ఉద్యోగస్తుల పట్ల శాపంగా మారిందని సి పి ఎస్ ను వెంటనే రద్దుచేయాలని. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యోగుల సంఘం జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ ఋూ అనేది చాలా ప్రమాధకరమైనదని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో సి పి ఎస్ రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు దాటవేసే ధోరణి కరెక్ట్ కాదని వెంటనే ఓ పి ఎస్ ను పునరుద్దరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు , పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేసారు. ఓ పి ఎస్ పునరుద్దరణ కోసం మనమంతా ఐక్యంగా నిలబడి, మన గొంతును బలంగా వినిపిద్దాం అందరు కోరారు..ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వినర్ శ్రీనేష్ కుమార్ నోరి, కో చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతి శ్రీ, సుధాకర్,రాజేష్, బల్వంత్ రెడ్డి,వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, సెక్రెటరీలు , మాధవ్ , ఆనంద్, మహేష్, ప్రమీల,వెంకటప్ప,పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ,అరుణ,గౌస్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాల

# మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కే. కిరణ్మయి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**





రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కే. కిరణ్మయి మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలు, మౌలిక వసతులు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను అవలంబించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.అనంతరం ప్రీ-ప్రైమరీ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న బోధన, ఆటలు, అభ్యసన కార్యకలాపాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారుల వయస్సుకు అనుగుణంగా ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో అభ్యసన కు అనుకూలమైన కార్యకలాపాలను నిర్వహిస్తూ నాణ్యమైన ప్రీ-ప్రైమరీ విద్యను అందించాలని సూచించారు.

**ఇంద్రా నగర్ గ్రామ సభలో పాల్గొన్న అదనపు కలెక్టర్**

అనంతరం ఇంద్రా నగర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కే. కిరణ్మయి పాల్గొన్నారు. గ్రామ సభలో చర్చించిన గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను ఆమె సమీక్షించారు.గ్రామ సభలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అభ్యర్థనలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా మరియు నిర్దేశిత గడువులోగా అమలు చేయాలని సూచించారు.ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 17న సామూహిక సెలవుకు సన్నద్ధం కావాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 ( ప్రభాత ఉదయం)**





సెప్టెంబర్ 1, 2004న పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను అమలు చేయడం ద్వారా రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ సామాజిక భద్రతను ప్రశ్నార్థకంగా మార్చారని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు,రాష్ట్ర సహాధ్యక్షులు విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస రెడ్డి, జిల్లా కోశాధికారి వన్నవాడ రమేష్ లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ --- సీపీఎస్ అమలై 22 సంవత్సరాలు పూర్తయిన కూడా ఓపీఎస్ పునరుద్ధరించక పోవడంతో మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు, నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే తమ ఆకాంక్షను ఈ నిరసనల ద్వారా ప్రభుత్వానికి బలంగా తెలియజేశారు. అంతేకాకుండా గత ఆగస్టు 23న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై తమ ఆకాంక్షను ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేశారని జిల్లా నాయకులు పేర్కొన్నారు.

**కాంగ్రెస్ మేనిఫెస్టో హామీని అమలు చేయాలి**

**రాష్ట్ర సహాధ్యక్షులు విష్ణు**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన 'సీపీఎస్ రద్దు -- పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ' హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**నవంబర్ 17న సామూహిక సెలవుకు సిద్ధం కావాలి**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన నవంబర్ 17వ తేదీని 'మేనిఫెస్టో డే'గా పాటిస్తూ, ఆ రోజున రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని యూనియన్ జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని వారు కోరారు. నవంబర్ 17న సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వానికి ఉద్యోగుల ఐక్యతను, పాత పెన్షన్‌పై ఉన్న బలమైన ఆకాంక్షను తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డి రాష్ట్ర సహాధ్యక్షులు విష్ణు జిల్లా కోశాధికారి వన్నవాడ రమేష్ కుమార్ జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చన్న, జిల్లా ఉపాధ్యక్షులు పాల్వాయి లక్ష్మి నారాయణ జిల్లా సభ్యులు కొండాపురం ప్రతాప్, గట్టు మండల ప్రెసిడెంట్ రాజు సాగర్, గద్వాల్ మండల ఉపాధ్యక్షులు తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మరాజ్యం ప్రగతిపథంలో వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకుంది

**తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న శుభవేళ రాష్ట్రంలో ఒక కీలక మైలురాయి ఆవిష్కృతమైంది**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**




తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు వెయ్యి రోజుల సుపరిపాలనను పూర్తి చేస్తుందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుంటున్న వెయ్యి రోజులు కేవలం పాలనా ఒక మైలురాయి మాత్రమే కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల పేదలపై ప్రత్యేక దృష్టితో పాటు మౌలిక వసతులు, పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతిచ్చిన కాలంగా వెయ్యి రోజుల పాలనను చూడవచ్చు అని అన్నారు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన, సంక్షేమం, వ్యవసాయం, ఉపాధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం, అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యతిస్తూ 'తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం దూసుకుపోతోంది. ఇచ్చిన హామీలు అమలుచేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతూకంగా ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలుచేస్తున్న పథకాలతో ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందని, రాష్ట్రం ఏర్పడేనాటికి మిగులు బడ్జెట్గా ఉన్న తెలంగాణ తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల మయంగా మారి ఆర్థికంగా పలు సవాళ్లు ఎదురవుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యతిచ్చింది అన్నారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతిస్తూ మహా లక్ష్మి పథకంలో భాగంగా సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా 2023 డిసెంబర్ 9వ తేదీన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి 30 నెలల్లో ప్రభుత్వం రూ.11 వేల కోట్ల మేర ఖర్చు చేయడంతో స్త్రీలకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం కలిగింది. అంతేకాక, మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రూ.27 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములుగా తీర్చిదిద్దింది. 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.5 లక్షల కుటుంబాలకు ఇళు మంజూరు చేసింది. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికభారాన్ని తగ్గించేందుకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతోపాటు రూ.500కే ఎల్పీజీ సిలిండర్ పంపిణీ చేస్తోంది అన్నారు. దీర్ఘకాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల ఆశలను నెర వేర్చే దిశగా ప్రభుత్వం 16.32 లక్షల కొత్త కార్డులు జారీ చేయడంతో రాష్ట్రంలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ప్రయోజనం చేకూ రుతోంది. పేదల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉచితంగా సన్నబియ్యం అందించే కార్యక్రమాన్ని చేపట్టడం చారిత్రాత్మకం అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో తమ ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశించి భంగపడ్డ తెలంగాణ యువతలో విశ్వాసం కలిగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేసిందన్నారు. విద్యార్థుల పోషకాహారంపై దృష్టి పెడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించింది. రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి నడుం బిగించింది. భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ముందుకుసాగుతూ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చి దిద్దడం లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆక ర్షించడంతోపాటు తెలంగాణను ప్రపంచ స్థాయి పారి శ్రామిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కేంద్రం వివక్ష ధోరణి ప్రభుత్వాన్ని విమర్శించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ వ్యవహరించడం దురదృష్టకరం. రెండు దఫాల పదేండ్ల కేసీఆర్ పాలనలో సాధించని అభివృద్ధి వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలనలో పూర్త వడంతో ఇక ప్రజలు తమను ఆదరించరనే అసహనం బీఆర్ఎస్ లో నెలకొంది అని, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ తెలం గాణపై వివక్ష చూపించడం దురదృష్టకరం. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను తొక్కిపెట్టకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి సహాయ సహకారాలందితే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది. ప్రతిప క్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభు త్వానికి రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతుండడంతో తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడమే కాకుండా, రాహుల్ గాంధీ దేశ ప్రధాన మంత్రి కావడం కూడా ఖాయం అని అన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన

# 420 హామీలపై నిరసన కార్యక్రమాలు

**నేటి నుండి డివిజన్ స్థాయిలో ప్రజాక్షేత్రంలో పోరాటం**

**బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన కోఆర్డినేటర్ సతీష్ అరోరా**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**



కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, బూటకపు 6 గ్యారంటీలు పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, డివిజన్ స్థాయి సమావేశాలతో ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్నట్టు బిఆర్ఎస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తెలిపారు. నేటి నుండి జరుగు డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశాలు మాజీ కార్పొరేటర్ ల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ డివిజన్ స్థాయి సమావేశాలు నేడు బోయినపల్లి డివిజన్లో, సెప్టెంబర్ 4 బాలానగర్ డివిజన్లో, సెప్టెంబర్ 5 బేగంపేట డివిజన్లో, సెప్టెంబర్ 6 ఫతేనగర్ డివిజన్ లో, సెప్టెంబర్ 7 మూసాపేట్ డివిజన్లో, సెప్టెంబర్ 8 అల్లాపూర్ డివిజన్లో, సెప్టెంబర్ 9 బాలాజీ నగర్, కె పి హెచ్ బి డివిజన్లు కలిపి, సెప్టెంబర్ 10 కూకట్ పల్ల డివిజన్లో జరుగుతాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు బూటకపు 6 గ్యారంటీలు పై జరుగు ప్రజా పోరాటానికి డివిజన్ స్థాయిలో మద్దతు కూడా కట్టి భారీ ఎత్తున నిరసనలు తెలుపుతూ కాంగ్రెస్ బూటకపు హామీలపై ఇంటింటికి బాకీ కార్డులు చేరే విధంగా చేసి ప్రజలను చైతన్య పరచాలని ఆయన పిలుపునిచ్చారు.




# ఫతేనగర్ ఫ్లైఓవర్‌కు అత్యవసర మరమ్మతులు చేపట్టాలి

**పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి:**

**క్రాంతి ముదిరాజ్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 1(ప్రభాత ఉదయం)**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి జోన్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ధాకు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు ప్రధానంగా ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై అత్యవసర రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలని, అలాగే ఫతేనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ఆమోదించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఫ్లైఓవర్‌పై రహదారి పరిస్థితి కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరమ్మతులను ఆలస్యం చేయకుండా చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ కమిషనర్ ధాకు నాయక్ సానుకూలంగా స్పందించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ మరమ్మతు పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. క్రాంతి ముదిరాజ్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సమన్వయకర్త కె. రాజు ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ మద్దూరి రాము, ఐజాజ్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కాంగ్రెస్ డివిజన్ నాయకులు తెలిపారు.



# ఎంపీ నిధుల వినియోగంపై నివేదిక సరైనది కాదు

**మంత్రి బండి సంజయ్**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 1 (ప్రభాత ఉదయం)**

ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక అసత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు

### కూకట్‌పల్లి ఎమ్మెల్యే

# పాదయాత్రను అడ్డుకోండి

**పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు బాలానగర్ డివిజన్‌కు ప్రాతినిధ్యం**

**ఓల్డ్ విలేజ్ లోని వెటర్నరీ, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని నిర్మించలేకపోయారని తీవ్ర విమర్శ**

**కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 1 (ప్రభాత ఉదయం)**



నేటి నుండి కూకట్ పల్లి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ప్రజలు అడ్డుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే భూములను 22ఎ నిషేధిత జాబితాలో పెట్టడం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సరికాదని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పాపమే నేడు అమాయక ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితం అయ్యారని, ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. పాదయాత్ర పేరుతో బస్తీల్లో ఎంత తిరిగినా ఇప్పుడు ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చెప్పుకోవడమే తప్ప చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ లో సాయినగర్, వినాయనకనగర్ ప్రాంతాల్లోని నాలాకు రిటైనింగ్ వాల్ ఇప్పటి వరకు నిర్మించక పోవడం విడ్డూరం అని పేర్కొన్నారు. రెండు సార్లు బాలానగర్ డివిజన్ కు బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించారు కానీ ఆ కాలంలో అంటే 10 సంవత్సరాలు బాలానగర్ ఓల్డ్ విలేజ్ లోని వెటర్నరీ, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని నిర్మించలేకపోయారని తీవ్రంగా విమర్శించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608